ఈదురుగాలులతో వరి పంటకు నష్టం

ప్రజాశక్తి - ఉంగుటూరు


ఈదురుగాలులకు పడిపోయిన వరి చేలు

వాయుగుండం కారణంగా ఈదురు గాలులతో ఈనిక దశ మీదున్న వరి పంట నేలనంటుతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో బుధవారం పలు గ్రామాల్లో చినుకులు, ఈదురు గాలులతో పొట్ట, ఈనిక దశ మీదున్న వరి పంట ఒరిగిపోతుంది. దీనివల్ల ఎకరానికి 5 నుంచి 10 బస్తాలు వరకూ దిగుబడి తగ్గే ప్రమాదం ఉందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. బోర్లు కింద, మెట్ట ప్రాంతాల్లో అధికంగా ఈ నష్టం ఉండనుందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

ఫీజు కట్టండి.. పరీక్షలు రాయండి..!

ఇంజినీరింగ్, డిగ్రీ విద్యార్థులపై కాలేజీ యాజమాన్యాలు హుకుం

ఫీజు రీయంబర్స్‌మెంట్‌పై ప్రభుత్వం మౌనం

విద్యార్థులకు నరకం చూపిస్తున్న యాజమాన్యాలు

సగం ఫీజు కడితేనే మొదటి సెమిస్టర్ పరీక్షలకు అనుమతి

దిక్కుతోచని స్థితిలో పేద, మధ్యతరగతి విద్యార్థులు

ఫీజు రీయంబర్స్‌మెంట్ పథకం అమలుపై కూటమి ప్రభుత్వం మౌనం వీడటం లేదు. దీంతో కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులకు నరకం చూపిస్తున్నాయి. మొత్తం ఫీజులో సగం సొమ్ము చెల్లిస్తేనే మొదటి సెమిస్టర్ పరీక్షలు రాయాలని, లేకపోతే కుదరదని యాజమాన్యాలు హుకుం జారీ చేశాయి. దీంతో దిక్కుతోచని స్థితిలో పేద, మధ్యతరగతి విద్యార్థులు కొట్టుమిట్టాడుతున్నారు. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుపై కూటమి సర్కార్ నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై విద్యార్థుల్లో ఆగ్రహం పెల్లుబికుతోంది.

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఇంజినీరింగ్, డిగ్రీ కాలేజీలు పదుల సంఖ్యలో ఉన్నాయి. ఆయా కాలేజీల్లో వేలాది మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. గత ప్రభుత్వం విద్యాదీవెన పేరుతో ఫీజు రీయంబర్స్‌మెంట్ పథకాన్ని అమలు చేసింది. నాలుగు దఫాలుగా ఫీజు రీయంబర్స్‌మెంట్ సొమ్మును విద్యార్థులు, తల్లుల ఉమ్మడి ఖాతాల్లో జమ చేసేది. ఆ సొమ్మును విద్యార్థులు కాలేజీలకు చెల్లించేవారు. గత ప్రభుత్వం ఫీజు రీయంబర్స్‌మెంట్ అమలులో కొన్ని ఇబ్బందులకు గురిచేయడంతో విద్యార్థుల్లో వైసిపి సర్కార్‌పై తీవ్ర వ్యతిరేకత ఏర్పడింది. దీంతో గడిచిన ఎన్నికల్లో చదువుకున్న యువత అంతా కూటమి సర్కార్‌వైపు మొగ్గారు. దీంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి నాలుగు నెలలు దాటిపోయింది. ఇప్పటి వరకూ కూటమి సర్కార్ విద్యార్థుల గురించి ఏమాత్రం ఆలోచించని పరిస్థితి నెలకొంది. ఇంజినీరింగ్, డిగ్రీ చదువువుతున్న విద్యార్థులకు నవంబర్ మొదటివారంలో తొలి సెమిస్టర్ పరీక్షలు నిర్వహించేందుకు కాలేజీ యాజమాన్యాలు నిర్ణయం తీసుకున్నాయి. ఈ నెల 19వ తేదీలోపు సెమిస్టర్ పరీక్ష ఫీజు రూ.1,250 చెల్లించాలని అనేక కాలేజీల యాజమాన్యాలు నోటీసులు జారీ చేశాయి. విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించేందుకు సిద్ధమవ్వగా, ట్యూషన్ ఫీజులో సగం సొమ్ము కడితేనే పరీక్ష ఫీజు చెల్లించే ఆన్‌లైన్ సైట్ ఓపెన్ అవుతుందని, వెంటనే ట్యూషన్ ఫీజు చెల్లించాలని కాలేజీ యాజమాన్యాలు హుకుం జారీచేశాయి. ఇంజినీరింగ్ కాలేజీల్లో వసతులను బట్టి ట్యూషన్ ఫీజు రూ.43 వేల నుంచి రూ.లక్షా ఐదు వేల వరకూ ఉంది. మొదటి సెమిస్టర్ పరీక్షలు రాయాలంటే రూ.32 వేల నుంచి రూ.63 వేల వరకూ చెల్లిస్తేనే మొదటి సెమిస్టర్ పరీక్షలు రాసేందుకు వీలుంటుంది. రూ.లక్షా ఐదు వేల ఫీజు ఉంటే రూ.53 వేలు వరకూ చెల్లించాల్సి ఉంది. పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు కష్టపడి ఎపి ఈసెట్‌లో మంచి ర్యాంకు సాధించి ఫీజు రీయంబర్స్‌మెంట్ ఉందనే భరోసాతో మంచి కాలేజీల్లో చేరారు. ముఖ్యంగా ఇంజినీరింగ్ రెండు, మూడు సంవత్సరాలు చదువుతున్న విద్యార్థులపై కాలేజీ యాజమాన్యాలు తీవ్రమైన ఒత్తిడి తెస్తున్నట్లు విద్యార్థులు చెబుతున్నారు.

పేద, మధ్యతరగతి విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరం

ఇంజినీరింగ్, డిగ్రీ విద్యను అభ్యసిస్తున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. రూ.30 వేలు, రూ.40 వేలు అప్పులు తెచ్చి ఫీజులు చెల్లించలేని నిస్సహాయ స్థితిలో విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో మొదటి సెమిస్టర్ పరీక్షలు రాయకుండా వదిలేసేందుకు చాలా మంది విద్యార్థులు నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. కూటమి ప్రభుత్వం ఫీజు రీయంబర్స్‌మెంట్ గురించి నోరు విప్పడం లేదు. విద్యార్థుల సమస్యను ఏమాత్రం పరిగణనలోకి తీసుకోవడం లేదు. ఇప్పటి వరకూ విధివిధానాలు సైతం ప్రకటించలేదు. ఫీజు తాము చెల్లిస్తాం, విద్యార్థులను ఇబ్బంది పెట్టొద్దన్న ప్రకటనను సైతం ప్రభుత్వం విడుదల చేయలేదు. దీంతో కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ప్రభుత్వాలు మారినా తమ దుస్థితి మారలేదంటూ విద్యార్థులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. ప్రభుత్వం వెంటనే ఫీజు రీయంబర్స్‌మెంట్‌కు సంబంధించి స్పష్టమైన ప్రకటన చేయాలి. విద్యార్థులపై కాలేజీ యాజమాన్యాలు ఒత్తిడి చేయకుండా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. ప్రభుత్వం ఏవిధంగా స్పందిస్తుందో వేచిచూడాలి.

మద్యం దుకాణం పెట్టొద్దని మహిళల ఫిర్యాదు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న మహిళలు

కన్నాపురం రోడ్డులో వినాయకుని గుడికి చేరువలో మద్యం దుకాణం ఏర్పాటు చేయొద్దంటూ, వెంటనే ఆ ప్రక్రియ ఆపాలని స్థానికులు తహశీల్దార్‌కు బుధవారం వినతిపత్రం సమర్పించారు. మద్యం దుకాణ లైసెన్స్ దక్కించుకున్నవారు తమ ప్రాంతంలో దుకాణం ఏర్పాటుకు ప్రయత్నాలు ప్రారంభించారన్నారు. ఈ ప్రాంతంలో ప్రయివేట్ హాస్పిటల్‌తోపాటు స్కూల్, కాలేజీ ఉన్నాయని తెలిపారు. వీరికి మద్దతుగా పంచాయతీ వార్డు సభ్యులు గొలిశెట్టి ప్రసాద్, ఏలేటి భాస్కర్, జనసేన మండల ప్రధాన కార్యదర్శి గొలిశెట్టి శ్రీనివాస్ పాల్గొని సంఘీభావం తెలిపారు.

నివాసాల వద్ద మద్యం దుకాణాలు పెట్టొద్దు

కలెక్టర్‌కు ఐద్వా వినతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లాలో మద్యం దుకాణాలను ప్రజల నివాస ప్రాంతాల్లో పెట్టకుండా తగు చర్యలు తీసుకోవాలని ఐద్వా జిల్లా కమిటీ సమావేశం డిమాండ్ చేసింది. ఐద్వా జిల్లా కార్యాలయంలో బుధవారం జరిగిన సంఘ సమావేశంలో ఐద్వా జిల్లా కార్యదర్శి ఎ.శ్యామలారాణి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా లైసెన్సులు ఇచ్చిన మద్యం షాపులను ప్రజల నివాసిత ప్రాంతాలకు దగ్గర్లో పెట్టకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విధానం వల్ల రాబోయే కాలంలో బెల్ట్ షాపులు విపరీతంగా పెరిగే అవకాశం ఉందన్నారు. మద్యాన్ని ఆదాయ వనరుగా రాష్ట్ర ప్రభుత్వం చూడటం వల్లే ఈ విధంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. మద్యాన్ని దశలవారీగా నియంత్రించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు జి.శారద, హైమావతి, అరుణకుమారి, వరలక్ష్మి, ఉషారాణి, రాజ్యలక్ష్మి హరిప్రసాదుర్గ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఐద్వా ప్రతినిధి బందం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించింది.

డిజె సౌండ్ సిస్టమ్ నిషేధించాలని ఫ్రీ లిటిగేషన్ కేసు

సీనియర్ న్యాయవాది చిక్కా భీమేశ్వరరావుచే దాఖలు

ప్రతివాదులకు నోటీసులు పంపిన న్యాయమూర్తి

ప్రజాశక్తి - ఏలూరు

డిజె సౌండ్ సిస్టమ్ వల్ల విపరీతమైన శబ్ద కాలుష్యం వ్యాప్తి చెంది ప్రజల మానసిక స్థితి దెబ్బతింటుందని, వెంటనే డిజె సౌండ్ సిస్టమ్‌ను జిల్లా వ్యాప్తంగా నిషేధించాలని ప్రముఖ సీనియర్ న్యాయవాది చిక్కా భీమేశ్వరరావు జిల్లా అధికారులకు విజ్ఞప్తి చేశారు. దీనికి సంబంధించి డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ ఏలూరు కోర్టులో ఫ్రీ లిటిగేషన్ కేసుగా దాఖలు చేశారు. ఈ పిటీషన్‌ను పరిశీలించిన డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఏలూరు వారు ప్రతివాదులైన జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్‌పి, డిపిఒ, జిల్లా పౌర సంబంధాల అధికారి, ఏలూరు కార్పొరేషన్ కమిషనర్లకు నోటీసులు జారీ చేశారు. ఈ నెల 21న లీగల్ సర్వీస్ అథారిటీ కోర్టుకు హాజరుకావాలని న్యాయమూర్తి వారికి నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా న్యాయవాది చిక్కా భీమేశ్వరరావు మాట్లాడుతూ ఈ డిజె సౌండ్ సిస్టమ్‌ను ఐదు నిమిషాల పాటు వింటే 50 నుండి 70 డెసిబెల్స్ కంటే ఎక్కువ శబ్దం వస్తుందని, అది ఒక వ్యక్తి గుండెను ప్రభావితం చేస్తుందని అన్నారు. 60 డెసిబెల్స్ కంటే ఎక్కువ శబ్దాన్ని వింటే మనుషులు వినికిడి శక్తిని కూడా కోల్పోతారన్నారు. ఏలూరు నగరంలోనే కాకుండా జిల్లావ్యాప్తంగా ప్రారంభోత్సవాలకు, ఊరేగింపులకు, జాతర్లకు, గ్రామోత్సవాలకు, వివిధ ఫంక్షన్లకు డిజె సౌండ్ సిస్టమ్‌ను ఉపయోగించడం వల్ల విపరీతమైన శబ్ద కాలుష్యం వెదజల్లుతుందన్నారు. డిజె సౌండ్ సిస్టమ్ భారీ వాహనాల్లో ఉంచి ఒకచోట నుంచి మరోచోటకు భారీ శబ్దాలతో తరలించడం కారణంగా ఎలక్ట్రికల్ వైర్లు తగిలి పలువురు ప్రాణాలు కూడా కోల్పోతున్నారని చెప్పారు. ప్రజల ప్రాణాలకు హాని కలిగిస్తున్న డిజె సౌండ్ సిస్టమ్‌ను జిల్లావ్యాప్తంగా నిషేధించాలని లీగల్ సర్వీస్ అథారిటీ కోర్టులో ఫ్రీ లిటిగేషన్ కేసు దాఖలు చేసినట్లు న్యాయవాది చిక్కా భీమేశ్వరరావు తెలిపారు.

32 ప్రత్యేక కౌంటర్ల ద్వారా తక్కువ ధరకే పామాయిల్, సన్‌ఫ్లవర్

జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి

మాట్లాడుతున్న జెసి ధాత్రిరెడ్డి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో ప్రతినెలా ఒకటో తేదీ నుంచే నిత్యావసర వస్తువుల పంపిణీ సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో పౌరసరఫరాల శాఖాధికారులు, సిబ్బంది, చౌకధరల దుకాణాల డీలర్ల ప్రెసిడెంట్, మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ ఆపరేటర్లు, వివిధ ఆయిల్ వర్తక సంఘాలు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ యాజమాన్యంతో బుధవారం నిర్వహించిన సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా ధాత్రిరెడ్డి మాట్లాడుతూ చౌకధరల దుకాణం, ఎండియు ఆపరేటర్లకు కందిపప్పు ఎక్కువ సబ్సిడీ ఉండటంతో ముందుగానే విడిపించి, ప్రతినెలా ఒకటో తేదీ నుండి పదో తేదీలోపు కార్డుదారులందరికీ పంపిణీ చేయాలని ఆదేశించారు. జిల్లాలో 32 పామాయిల్, సన్ ఫ్లవర్ ఆయిల్ తక్కువ ధరకు అందించేలా ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గతంలోనే అన్ని రైతుబజార్లు, డీమార్ట్, మోర్, రిలయన్స్ తదితర మార్కెట్లలో బియ్యం, కందిపప్పు సబ్సిడీపై ప్రజలకు అందుబాటులో ఉంచామన్నారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి ఆర్.సత్యనారాయణరాజు, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీలక్ష్మి, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ నేరెళ్ల రాజేంద్ర, పలువురు అధికారులు పాల్గొన్నారు.

విత్తనాల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించాలి

జిల్లాలో ఈ నెల 18వ తేదీ నుండి రీసర్వేపై రెవెన్యూ అధికారులు గ్రామ సభలు నిర్వహించడానికి సిద్ధంగా ఉండాలని ఆర్‌డిఒలను జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి ఆదేశించారు. బుధవారం ఆమె తన ఛాంబర్‌లో సివిల్ సప్లయిస్, రెవెన్యూ అధికారులతో ధాన్యం కొనుగోలు కేంద్రాలు, పిజిఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలు రీఓపెనింగ్‌పై వచ్చిన అర్జీలు, రీసర్వే గ్రామ సభలు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ధాత్రిరెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ రేషన్ దుకాణాల్లో, ఎంఎల్ఎస్ పాయింట్లను, ధాన్యం కొనుగోలు కేంద్రాలు, పెట్రోల్ బంకులు, వంట గ్యాస్ గొడౌన్లు, ధాన్యం కొనుగోలు చేసే రైస్ మిల్లులను, గోనె సంచుల పంపిణీ, సీసీ కెమెరాల ఏర్పాట్లు తదితర అంశాలపై జాయింట్ దిశానిర్దేశం చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు సరఫరా చేసే గోనె సంచులు డ్యామేజీ లేకుండా పరిశీలించాలన్నారు. రైస్‌మిల్లులకు ఇచ్చిన టార్గెట్ ప్రకారం గోనె సంచులను సిద్ధం చేయాలన్నారు. రైస్‌మిల్లులను కూడా ఆర్‌డిఒలు తనిఖీలు చేయాలని తెలిపారు. చింతలపూడిలో చెక్‌పోస్టు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నాణ్యతాలోపం ఉన్న విత్తనాలు అమ్మే షాపులపై తనిఖీలు చేసి షాపు యజమానులపై చర్యలు తీసుకొని నివేదికను అందజేయాలన్నారు. రేషన్ బియ్యం రాత్రివేళలో అక్రమంగా తరలించే వారిపై సంబంధిత అధికారులు నిఘాపెట్టి తనిఖీలు ముమ్మరం చేసి సరుకును స్వాధీనపర్చుకొని వారిపై చర్యలు తీసుకోవాలని జెసి ఆదేశించారు. ఏజెన్సీ మండలాల్లో కుల దరఖాస్తులు పెండింగ్ ఎక్కువగా ఉన్నాయని, వాటిపై సమీక్షించి పెండింగ్ లేకుండా చూడాలన్నారు. సమావేశంలో ఏలూరు, నూజివీడు, జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒలు అచ్యుత అంబరీష్, వాణి, కె.అద్దయ్య, జిల్లా వ్యవసాయ శాఖాధికారి షేక్ హబీబ్ భాషా, పౌర సరఫరాల జిల్లా మేనేజరు శ్రీలక్ష్మి, జిల్లాపౌర సరఫరాల అధికారి ఆర్.సత్యనారాయణరాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దేవకిదేవి పాల్గొన్నారు.

కొనసాగిన టెట్ పరీక్షలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉపాధ్యాయ అర్హత పరీక్షలు (ఎపి టెట్) బుధవారం 12వ రోజు ప్రశాంతంగా జరిగాయి. వట్లూరులోని సిద్ధార్థ క్వెస్ట్ సిబిఎస్ఇ పాఠశాలలో ఉదయం 9:30 నుంచి 12 గంటల వరకు జరిగిన పరీక్షకు మొత్తం 185 మందికి 160 మంది హాజరయ్యారు. 20 మంది గైర్హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం 2:30 నుంచి 5 గంటల వరకు జరిగిన పరీక్షకు మొత్తం 185 మందికి 153 మంది హాజరయ్యారు. 32 మంది గైర్హాజరయ్యారు. ఈ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.అబ్రహం తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు సూర్యప్రభ

విద్యార్థినికి పలువురి అభినందన

ఎంపిక పత్రం అందుకుంటున్న సూర్యప్రభ

ఆగిరిపల్లి : ఫినిషింగ్ అండర్-14 విభాగంలో ఆగిరిపల్లి శ్రీ వెంకటేశ్వర పబ్లిక్ స్కూల్ విద్యార్థిని నైనవరపు సూర్యప్రభ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందని ఆ స్కూల్ కరస్పాండెంట్ మానుకొండ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ నెల 15న ఎన్‌టిఆర్ జిల్లా నున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో జరిగిన జిల్లా స్థాయి సెలక్షన్స్‌లో ఎంపికై నంద్యాల జిల్లాల్లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రాతినిత్యం వహించనున్నట్లుగా ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సూర్యప్రభను స్కూల్ యాజమాన్యం, గ్రామస్తులు అభినందించారు.

మద్యం దుకాణాల కోసం లొల్లి..!

అద్దె షాపుల కోసం వెంపర్లాట

అంతా నాయకుల కను సన్నల్లోనే..!

వ్యాపారులు సిద్ధం చేసుకున్న కొత్త సరుకులు

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉంగుటూరు మండలంలో ఏడు మద్యం దుకాణాలను వేర్వేరు సిండికేట్లు, గ్రూపుల వారికి లక్కీ డ్రాలో దక్కించుచున్నారు. వారం రోజుల వ్యవధితో తాత్కాలిక లైసెన్సులు (ప్రొవిజినల్) తీసుకున్న వ్యాపారులు ఏఏ గ్రామాల్లో ఎక్కడెక్కడ మద్యం దుకాణాలను కేటాయించాలనే దానిపై రెండు రోజుల నుంచి కసరత్తులు, చర్చలు ఎట్టకేలకు కొలిక్కివచ్చాయి. పూళ్లకు చెందిన లైసెన్సుదారుడికి తొలుత గణపవరం రోడ్డులో ఐస్ ఫ్యాక్టరీల సమీపంలో దుకాణానికి అంగీకరించారు. కాని ఆ దుకాణాన్ని వేరే సిండికేట్ వారికి కేటాయించడంతో అతను బాదంపూడికి దుకాణాన్ని మార్చుకోవాల్సి వచ్చింది. తూర్పుగోదావరి జిల్లా ఘంటావారిగూడేనికి చెందిన వ్యాపారికి కైకరంలో దుకాణం ఏర్పాటు చేసుకోనున్నారు. పోతునూరుకు చెందిన వ్యాపారి కొత్తఉంగుటూరులో, చేబ్రోలు, ఉంగుటూరులో పూళ్లకు చెందిన ఓ పార్టీ నేతకు కేటాయింపులు జరిగిపోయాయి. గొల్లగూడెంలో దుకాణాన్ని వేరే సిండికేట్ వారికి కేటాయించారు. ఈ మండలంలో ఈ ఏడు దుకాణాలన్నింటిని ఒకే సిండికేట్ కిందకు తీసుకొచ్చి వ్యాపారాన్ని సజావు జరిగేలా ఉంగుటూరుకు చెందిన ఓ పార్టీ నాయకులు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

ఏలూరులో 22న జాబ్‌మేళా

ప్రజాశక్తి - ఏలూరు

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త అధ్వర్యంలో ఏలూరు ప్రభుత్వ డిఎల్‌టిసి/ఐటిఐ కళాశాలలో ఈ నెల 22వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా ఇన్‌ఛార్జి వాడపల్లి కిషోర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ ఫెయిర్‌లో హీరో కంపెనీ, మోహన్ స్పిన్‌టెక్స్, అపోలో ఫార్మసీస్ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని, సుమారు 180 మంది నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ జాబ్‌మేళాకు పదో తరగతి, ఇంటర్, ఐటిఐ, డిగ్రీ, పిజి వంటి విద్యార్హతలు ఉండి 18 నుంచి 30 సంవత్సరాల వయస్సు గల వారు అర్హులని తెలిపారు. వివరాలకు 9493482414, 8919608183ను (9988853335 - టోల్ ఫ్రీ) సంప్రదించాలని పేర్కొన్నారు. ఈ మినీ జాబ్‌మేళాకు హాజరయ్యే అభ్యర్థులు తమ బయడేటా, సర్టిఫికెట్స్ నకలతో హాజరు కావాలని తెలిపారు. %

భీమడోలు శ్రీవెంకటేశ్వర కళాశాలలో...

భీమడోలు : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త అధ్వర్యంలో భీమడోలు శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల (స్కిల్ హబ్)లో ఈ నెల 22వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా ఇన్‌ఛార్జి వాడపల్లి కిషోర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ ఫెయిర్‌లో ఇన్నోవా సోర్సు, హెట్రో ల్యాబ్స్, బజాజ్ క్యాపిటల్ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. సుమారు 220 మంది నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ జాబ్ మేళాకు పదో తరగతి, ఇంటర్, ఐటిఐ, డిగ్రీ, పిజి వంటి విద్యార్హతలు ఉండి 18 నుంచి 30 ఏళ్ల వయస్సు గల వారు అర్హులని తెలిపారు. వివరాలకు 8179391045, 9642387539ను (9988853335 - టోల్ ఫ్రీ) సంప్రదించాలని పేర్కొన్నారు. ఈ జాబ్‌మేళాకు హాజరయ్యే అభ్యర్థులు తమ బయోడేటా, సర్టిఫికెట్స్ నకలతో హాజరు కావాలని తెలిపారు.

సమస్యల పరిష్కారంపై అధికారులు దృష్టి పెట్టాలి

సర్వసభ్య సమావేశంలో ఎంపిపి దుర్గాభవాని

ప్రోటోకాల్ పాటించడంలేదని ప్రజా ప్రతినిధుల ఆవేదన

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి దుర్గాభవాని

ప్రజాశక్తి - ముసునూరు

మండల సర్వసభ్య సమావేశంలో పొందుపరిచిన అంశాలను మళ్లీ సర్వసభ్య సమావేశం వచ్చినా వాటిని పరిష్కరించలేకపోతున్నారని అధికారులను ఎంపిపి కొండా దుర్గాభవాని వెంకట్రావు, వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన నిలదీశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ జి.రాణి ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి ఎస్.మధుమోహన్ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో ఖరీఫ్ పూర్తవుతుందని, రబీ సీజన్‌లో కూడా ఇ-క్రాప్ నమోదు, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాట్ల గురించి ప్రజాప్రతినిధులకు వివరించారు. మండల విద్యాశాఖాధికారి బివి ఎస్.సుబ్బారావు మాట్లాడుతూ మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలవుతుందన్నారు. ముసునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జూనియర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకం వల్ల కొన్ని ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఆయన దృష్టికి రాగా పరిష్కరిస్తానన్నారు. వైద్యాధికారి కరిముల్లా మాట్లాడుతూ వర్ష ప్రభావంతో గ్రామీణ ప్రాంతాల్లో కూడా సీజనల్ వ్యాధులు రావడంతో, వైద్య సిబ్బందితో ఎటువంటి ఇబ్బందులు లేకుండా నాణ్యతతో కూడిన వైద్యం అందించామన్నారు. మండలంలోని 16 గ్రామాల్లో 52 అంగన్వాడీ కేంద్రాల్లో 618 మంది అంగన్వాడీ విద్యార్థులకు, 332 మంది గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్నట్లు చెప్పారు. వెలుగు ఎపిఎం కె.రాంబాబు మాట్లాడుతూ మండలంలోని 16 గ్రామాల్లో 1501 గ్రూపులు ఉన్నాయని, 15,750 మంది సభ్యులు రూ.32 కోట్లు రుణాలు తీసుకున్నారు. శ్రీనిధి కింద రూ.50 వేల నుంచి రూ.5 లక్షల వరకు 24 వాయిదాలు లేదా 36 వాయిదాలు ద్వారా వడ్డీ లేని రుణాలు మహిళలకు అందిస్తున్నారన్నారు. జెడ్‌పిటిసి సభ్యులు వరికూటి ప్రతాప్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాలకు ప్రోటోకాల్ పాటించటం లేదని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నూతన ప్రభుత్వం వచ్చిన తర్వాత జెడ్‌పిటిసి, ఎంపిపి, వైస్ ఎంపిపి పదవులకు ప్రోటోకాల్ ఉండటం లేదన్నారు. మండల స్థాయిలో నిర్వహించే కార్యక్రమం గురించి తమకు ముందుగా తెలియజేయడం లేదన్నారు. డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ ఎపిఎస్‌ఆర్‌టిసి రమణితో ఎంపిపి దుర్గాభవాని మాట్లాడుతూ నూజివీడు - చింతలపూడి వయా ముసునూరు మీదుగా బస్సు నడపాలని, అలాగే నూజివీడు - రమణక్కపేట మీదుగా హైదరాబాద్ బస్సు నడపాలని గత సర్వసభ్య సమావేశంలో తీర్మానం చేయగా, నేటికీ ఆ రూటులో బస్సులు నడపడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శర్మ, ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలి

భోజనం వడ్డిస్తున్న ఎంపిడిఒ వెంకటేశ్వరరావు

టి.నరసాపురం : విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎంపిడిఒ ఎస్.వెంకటేశ్వరరావు సూచించారు. స్థానిక జెడ్‌పి హైస్కూల్‌ని సందర్శించిన ఆయన మధ్యాహ్న భజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులకు స్వయంగా వడ్డించి నాణ్యత పరిశీలించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు పలు సూచనలు సలహాలు అం దించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. ప్రతిఒక్కరూ సామాజిక స్పృహ కలిగి ఉండాలన్నారు. ఎంఇఒ టి.రామ్మూర్తి మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు ప్రణాళికా బద్ధంగా చదవాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం బి.లింగు స్వామి, ఉపాధ్యాయ సిబ్బంది కెవి.నారాయణ, ఆర్‌విజి.కృష్ణారావు, కె.కుటుంబరావు, జె.నెహ్రూ ఉన్నారు.

ఎంఎల్ఎస్ పాయింట్ తనిఖీ

ప్రజాశక్తి - కైకలూరు

మండల స్టాక్ పాయింట్ నుంచి రేషన్ దుకాణాలకు నిత్యావసర సరుకుల సరఫరాకు అన్ని చర్యలు తీసుకున్నామని జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి తెలిపారు. కైకలూరులోని ఎంఎల్ఎస్ పాయింట్‌ను జెసి పి.ధాత్రిరెడ్డి బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. నిల్వల వివరాలను పరిశీలించారు. జెసితో పాటు ఏలూరు ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీలక్ష్మి, తహశీల్దార్, గ్రామ రెవెన్యూ అధికారులు ఉన్నారు.

అవినీతికి పాల్పడితే చర్యలు : జెసి ధాత్రిరెడ్డి

ప్రజాశక్తి - ముదినేపల్లి

ప్రజా పంపిణీ వ్యవస్థ డీలర్లు అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి హెచ్చరించారు. మండలంలోని పెరూరు, దాకరం రేషన్ డిపోల్లో అవకతవకలు జరుగుతున్నట్లు వచ్చిన ఆరోపణలపై జెసి స్పందించి బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదలకు చేరాల్సిన నిత్యావసర సరుకులు డీలర్లు, ఎండియు ఆపరేటర్లు పక్కదారి పట్టించడం నేరపూరిత చర్య అన్నారు. ఈ రెండు గ్రామాల్లో చౌక ధరల దుకాణాలపై వచ్చిన ఆరోపణలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి బాధ్యులైన డీలర్, ఎండియు ఆపరేటర్‌పై తగిన చర్యలు తీసుకోవాలని పౌర సరఫరాల శాఖ జిల్లా అధికారిని ఆదేశించారు. ఈ దుకాణాల పరిశీలన అనంతరం మండలంలోని పెదపాలపర్రులో ఏర్పాటు చేయబోయే పెట్రోల్ బంకు స్థల పరిశీలన చేసి సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. జెసితో పాటు తహశీల్దార్ సుభాని, మండల సర్వేయర్ శీలం రాజశేఖర్ రెడ్డి, విఆర్ఒలు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

వెంకటరెడ్డి కుటుంబాన్ని ఆదుకోవాలి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మండలంలోని రెడ్డిగూడెంలో గతేడాది జనవరిలో చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వెంకటరెడ్డి కుటుంబాన్ని ఆదుకోవాలని గిరిజన జెఎసి నాయకులు మొడియం శ్రీనివాస్, ఆదివాసీ సేన రాష్ట్ర అధ్యక్షులు మడకం వెంకటేశ్వరరావు, దళిత సంఘాల నాయకులు, కెవిపిఎస్ జిల్లా నాయకులు అందుగుల ఫ్రాన్సిస్ కోరారు. వెంకటరెడ్డి భార్య అమ్మాజీని బుధవారం పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంకటరెడ్డి మృతికి కారకులైన టిడిపి మండలాధ్యక్షులు ముసునూరి సోంబాబును అరెస్ట్ చేసి ఎస్‌సి, ఎస్‌టి కేసు, హత్య కేసు నమోదు చేయాలని, లేకపోతే ప్రజా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కేసులో అన్యాయంగా ఎఫ్ఐఆర్‌లో పేరు నమోదు చేయడం వల్ల తీవ్రంగా నష్టపోయిన దొరమామిడి గ్రామానికి చెందిన ఎ.చింతారావుకు రక్షణగా నిలబడి ఉద్యమిస్తామన్నారు. భర్తను కోల్పోయిన అమ్మాజీకి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, నష్టపరిహారం ఇవ్వాలని, ఇద్దరు పిల్లలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాజారెడ్డి, బాధితురాలు అమ్మాజీ, గ్రామ పెద్దలు ఉన్నారు.

విల్సన్‌కు అండగా పివి.సునీల్‌కుమార్

ప్రజాశక్తి - టి.నరసాపురం

కష్టంలో ఉన్న ఎయిమ్ నాయకుడు దూబా విల్సన్‌కు ఐపిఎస్ అధికారి పివి.సునీల్‌కుమార్ అండగా నిలిచారు. వైద్య ఖర్చు భరించడానికి ముందుకు వచ్చారు. గ్రామానికి చెందిన దూబ విల్సన్ ఇటీవల కేన్సర్‌తో అనారోగ్యానికి గురయ్యారు. ఎయిమ్‌లో క్రియాశీలక పాత్ర పోషించిన విల్సన్ అనారోగ్యంతో బాధపడుతూ ట్రీట్‌మెంట్ చేయించుకోవడానికి కూడా ఆర్థిక స్థోమత లేక ఇంటి వద్ద ఉండి బాధపడుతున్న పరిస్థితిని గమనించి విషయాన్ని ఎయిమ్ అధ్యక్షులు పివి.సునీల్‌కుమార్ దృష్టికి ఎయిమ్ జిల్లా అధ్యక్షులు వాసే ఆనంద్ తీసుకెళ్లారు. దీంతో విషయం తెలుసుకున్న వెంటనే సునీల్‌కుమార్ హైదరాబాద్‌లోని బసవతారకం కేన్సర్ హాస్పిటల్ అపాయింట్‌మెంట్ తీసుకుని విల్సన్‌ను ఆ హాస్పిటల్‌లో జాయిన్ చేయించారు. అంతేకాకుండా అతని వైద్యానికి అయ్యే మొత్తం ఖర్చు ఆయనే చూసుకుంటానన్నారని హామీ ఇచ్చారని, ఉదయం ఉసపతలో విల్సన్‌కు వైద్య సేవలు ప్రారంభమయ్యాయని రేడియేషన్ ఓపి ఎంతవరకు తట్టుకుంటుందని విషయాలను రేపు ఉదయం రిపోర్ట్ వచ్చాక డాక్టర్లు వెల్లడిస్తారని జిల్లా అధ్యక్షుడు వాసే ఆనంద్ తెలిపారు. విల్సన్‌కు అండగా నిలిచిన సునీల్‌కుమార్‌కు ఎయిమ్ జిల్లా, మండల నాయకులు ధన్యవాదాలు తెలిపారు.

రీ సర్వే కోసం రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి - ఉంగుటూరు

మండలంలో పొలాల రీ-సర్వే గ్రామసభలు నిర్వహించేందుకు షెడ్యూల్ రూపొందించామని తహశీల్దార్ వై.పూర్ణచంద్రప్రసాదరావు తెలిపారు. భూ-వివాదాలు తేడాలు, జాయింట్ భూముల విభజన, వారసత్వ పేర్ల నమోదు ఇతర సమస్యలపై దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. రీ- సర్వే జరిగిన గ్రామాల్లో రైతులకు ఇచ్చిన రికార్డుల్లో మార్పుల కోసం 18 తేదీ నుంచి 25 వరకూ గ్రామసభలు నిర్వహిస్తామన్నారు. 18న వెల్లమిల్లి, 19 బొమ్మిడి, 22న కాగుపాడు, 23న రావులపర్రు, 24న గారపాడు, 25న దొంతవరంలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

దెందులూరు :దెందులూరు మండలంలోని రీ-సర్వే జరిగిన గ్రామాల్లో ఈ నెల 18వ తేదీ నుంచి నవంబర్ ఐదో తేదీ వరకు గ్రామసభలు నిర్వహించనున్నట్లు దెందులూరు తహశీల్దార్ సుమతి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 18న మేడినరాపాలెం, 19న తిమ్మన్నగూడెం, 22న నరసింహపురం, 23న శ్రీరామవరం, 24న గుడిగుంట, 25, 26న అక్కిరెడ్డిగూడెం, 29న గాలాయగూడెం, 30న కొత్తపల్లి, నవంబర్ 1న చల్లచింతలపూడి, 2న ఉప్పుగూడెం, 5న కొవ్వలిలో గ్రామ సభలు జరుగుతాయని తెలిపారు. ప్రజలు గ్రామ సభకు హాజరై రీ-సర్వేలో సమస్యలపై డాకుమెంట్లు, ఇతర ఆధార పత్రాలతో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి

ప్రజాశక్తి - చింతలపూడి

ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సిందేనని చింతలపూడి ఎస్ఐ కుటుంబరావు చెప్పారు. చింతలపూడి నగర పంచాయతీలో పాత బస్టాండ్ వద్ద హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనదారులకు హెల్మెట్ ప్రాముఖ్యతను వివరించారు. ద్విచక్రవాహనదారులందరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, రోడ్డు నియమ నిబంధనలు పాటించాలని సూచించారు.

18న ఐఎఫ్‌టియు రాష్ట్ర సదస్సు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఈ నెల 18వ తేదీన నిర్వహించే ఐఎఫ్‌టియు రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని సంఘం ఏలూరు నగర ప్రధాన కార్యదర్శి నౌడు నెహ్రూబాబు కోరారు. ఈ మేరకు ఐఎఫ్‌టియు అనుబంధ ఎపి ప్రగతిశీల భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో దంగేటూరులోని ఏరియా ఆస్పత్రి వద్ద బుధవారం వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నెహ్రూబాబు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డులో సుమారు 1.34 లక్షల మంది కార్మిక శాఖలో రిజిస్టర్ అయి ఉన్నారన్నారు. గత నాలుగు నెలల నుంచి ఎటువంటి పరిహారాలు అందటం లేదని, నిర్మాణరంగ కార్మికులు ఇప్పటికే పని లేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక పథకం సక్రమంగా అమలు కావడం లేదని, దానివల్ల భవనాల నిర్మాణం జరగటం లేదని, ఈ నేపథ్యంలో భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి లేక, పని లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, భవన నిర్మాణ సంక్షేమ బోర్డును బలోపేతం చేయాలని, సంక్షేమ ఫలాలను అమలు చేసే దిశగా ప్రభుత్వం ఆలోచన చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 18వ తేదీన విజయవాడలో జరుగుతున్న ఐఎఫ్‌టియు రాష్ట్ర సదస్సుకు భవన నిర్మాణ కార్మికులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వర్మ, మత్తే భాస్కర్, కుమార్, నాగరాజు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

ఇసుక లారీ పట్టివేత

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలోని గవరవరం గ్రామంలో పోలీసులు అక్రమ ఇసుక రవాణాపై దాడి చేసి ఒక వ్యక్తిని అరెస్ట్ చేశారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు గ్రామ సెంటర్ వద్ద బుధవారం దాడి చేశారు. ఈ దాడిలో టిప్పర్ లారీలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వ్యక్తిని పట్టుకున్నారు. దెందులూరు పురిపెండి అజయ్‌కుమార్‌గా గుర్తించారు. లారీతో పాటు ఇసుకను స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ.7,500ఉంటుందని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ఆటో కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - కుక్కునూరు

ఆటో పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయాలని సిఐటియు మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సుందరయ్య భవనం ప్రజా సంఘాల కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు ఆటో డ్రైవర్ల యూనియన్ సమావేశం పోచారపు వెంకటేశ్వర్లు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయికిరణ్ మాట్లాడుతూ నిత్యం ప్రమాదాల అంచున జీవనం సాగిస్తున్న ఆటో కార్మికులు పూట గడవక తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సరిగా సర్వీస్ లేకపోవడంతో ఖాళీ ఆటోలను తిప్పడంతో డీజిల్ కొట్టించుకోవడానికి కుడా ఆర్థిక లోటు ఏర్పడిందన్నారు. కుక్కునూరు మండల కేంద్రంలో ఆటోలు పార్క్ చేసుకోవడానికి, డ్రాపింగ్, పికప్ చేసుకోడానికి పాయింట్ లేకపోవడంతో ప్రయాణికులు ఎవరూ ఆటోలు ఎక్కడం లేదన్నారు. ఇప్పటికే ఈ విషయమై అధికారులకు వినతిపత్రం అందించినా అధికారుల్లో స్పందన లేదన్నారు. ఇప్పటికైనా మండల అధికారులు స్పందించి ఆటో కార్మికులకు పార్కింగ్ స్థలం, పికపింగ్ పాయింట్, డ్రాపింగ్ పాయింట్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేకపోతే ఆటో డ్రైవర్లను ఐక్యం చేసి రిలే దీక్షలు చేస్తామని సాయికిరణ్ హెచ్చరించారు. ఈ సమావేశంలో సుబాన్, వేల్పుల దుర్గయ్య, శనగ రాము, పెంకే మహేష్, అశోక్, గోపీ, రంజిత్, చంద్రరావు పాల్గొన్నారు.

బాధితులకు 'మానవత' సాయం

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని పట్టిసీమ గ్రామంలో కొన్ని రోజుల క్రితం వివిధ ప్రమాద సంఘటనల్లో తీవ్రంగా గాయపడిన బాధితులకు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు బుధవారం ఆర్థిక సహాయం అందించారు. పట్టిసీమ గ్రామానికి చెందిన కోడి సాయి చక్రధర్, కోడి తాతారావు అనే వ్యక్తులు రోడ్డు ప్రమాదంలో గాయపడి రాజమహేంద్రవరంలో ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని తెలుసుకున్న మానవత సభ్యులు వారి ఇరువురికి రూ.ఐదు వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో మానవత ప్రెసిడెంట్ పూనెం పోశిబాబు, ఆకుల నరసింహమూర్తి, తెలగంశెట్టి వెంకటేశ్వరరావు, కొమ్మిశెట్టి వెంకటేశ్వరరావు, సిద్దా కృష్ణమూర్తి, కోటంరాజు రాంబాబు, సర్పంచి సబ్బారపు శ్రీరామ్మూర్తి, సానా లక్ష్మి, చంద్రకుమారి, ఆకుల బుజ్జి, పాదం రాజబాబు పాల్గొన్నారు

డిపోకు తరలిన మద్యం దుకాణాల్లో సరుకు

ప్రజాశక్తి - ఉంగుటూరు

మండలంలో ఏడు ప్రభుత్వ మద్యం దుకాణాల్లో సరుకును ఎక్సైజ్ శాఖ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకుని ఏలూరు ప్రభుత్వ డిపోకు తరలించారు. కూటమి ప్రభుత్వం నూతన మద్యం విధానాన్ని అమలు చేయనున్న నేపథ్యంలో గత ప్రభుత్వంలో నిర్వహించిన దుకాణాల్లో మద్యం స్టాక్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. భీమడోలు ఎక్సైజ్ శాఖ అధికారులు స్థానిక విఆర్ఒల సమక్షంలో తరలింపు చేపట్టారు.

'మహా పుణ్యక్షేత్రాన్ని మద్యం కేంద్రంగా మారుస్తున్న ప్రభుత్వం'

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

అంతర్జాతీయ స్థాయిలో మహా పుణ్యక్షేత్రంగా ఖ్యాతి పొందిన తిరుమల తిరుపతిని మద్యం కేంద్రంగా మార్చేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర పన్నిందని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ గోళ్ల పవన్‌కుమార్ దుయ్యబట్టారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ తిరుమల తిరుపతి పట్టణంలో 227 మద్యం దుకాణాలకు గేట్లు బార్ల తెరవడం వెనక సనాతన ధర్మానికి అర్థం ఏమిటో వివరించాలని కోరారు. ప్రతి అంశంలో సిండికేట్ కాంట్రాక్టులదే హవాగా కొనసాగటం దారుణన్నారు. తిరుమల తిరుపతిలో జరిగే మద్యం వ్యాపారాలపై ప్రజలు, భక్త బృందాలు పెద్ద ఎత్తున తిరుగుబాటు బావుట ఎగరవేయాలన్నారు.

ఆక్రమణలో ఆర్అండ్‌బి రోడ్లు..!

విచ్చలవిడిగా షాపుల ఏర్పాటు
ప్రయాణికుల ఇక్కట్లు

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడిలో ఆర్ అండ్‌బి రోడ్లు ఆక్రమణలకు గురవుతున్నాయి. తమ పరిధి కాదని మున్సిపాలిటీ వారి పరిధి అని ఆర్అండ్‌బి అధికారులు చేతులెత్తేస్తున్నారు. చింతలపూడి మండలం ఫాతిమాపురం అడ్డరోడ్డు నుంచి చింతలపూడి కొత్త బస్టాండ్ వరకు షాపులు రోడ్డు మీదకు వచ్చాయి. ఆయా షాపులకు వచ్చే వారి వాహనాలు రోడ్డుపై ఉంచుతున్నారు. దీంతో ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఏ వాహనమైన అదుపుతప్పితే ప్రాణనష్టం సంభవించే అవకాశం ఉందని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఆర్అండ్‌బి రోడ్ల ఆక్రమణలు తొలగించకపోతే ప్రమాద స్థలాలుగా తయారయ్యే అవకాశం ఉందంటున్నారు. ఆక్రమణదారులు తేలేసోమవారం రోడ్డు నుంచి ఫాతిమాపురం చెరువు వరకు ఉన్న కాలువను ఆక్రమించి దానిని పూడ్చివేసి షాపులు ఏర్పాటు చేసుకున్నారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి ఆర్అండ్‌బి రోడ్ల ఆక్రమణలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై ఆర్అండ్‌బి ఎఇ సుందరంను వివరణ కోరగా ఆర్అండ్‌బి రోడ్లు ఆక్రమణపై పంచాయతీ, మున్సిపాలిటీ అధికారులు ఆక్రమణదారులకు నోటీసులు ఇవ్వాలి. మున్సిపల్ కమిషనర్, పంచాయతీ కార్యదర్శులను అడిగితే ఆర్అండ్‌బి రోడ్లు ఎక్కడ వరకు ఉన్నాయో అనేది తెలియజేస్తామని తెలిపారు.

అధిక ధరలపై 18న ధర్నా : సిపిఎం

ప్రజాశక్తి - పెదపాడు

అధిక ధరలు, నిరుద్యోగం, విశాఖ ఉక్కు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా నవంబర్ ఎనిమిదో తేదీ నుంచి 15వ తేదీ వరకు సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ప్రజాహోరు పేరుతో ఇంటింటికీ ప్రచార కార్యక్రమం నిర్వహించాలని, 18వ తేదీన మండల కార్యాలయం వద్ద ధర్నా చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.లింగరాజు పిలుపునిచ్చారు. పెదపాడులోని నర్రా ఆంజనేయులు భవనంలో సిపిఎం పెదపాడు శాఖా మహాసభ ఆ పార్టీ నాయకులు గుండపనేని సురేష్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆర్.లింగరాజు మాట్లాడుతూ గత నెల రోజుల్లోనే ధరలు సామాన్యులకు అందుబాటులో లేని విధంగా ఆకాశాన్నంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాస్, సిపిఎం నాయ కులు షేక్ కరీముల్లా, పి.రహేల్, ముసునూరి కొండలరావు, నీలపాల వెంకటేశ్వరరావు, షేక్ షఫీరా పాల్గొన్నారు.

ఏలూరు :వంగాయగూడెం ప్రాంతంలో ప్రధాన రోడ్డు వెంటనే వేయాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. సిపిఎం పడమర వీధి స్థానిక శాఖ మహాసభ చేపల చెట్టు సెంటర్‌లోని అప్పారావు గ్రంథాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పడమర వీధి శాఖ కార్యదర్శి వైఎస్.కనకారావు మాట్లాడుతూ వంగాయగూడెం ప్రధాన రహదారైన మెయిన్ రోడ్డు గతుకుల మయంగా మారిందన్నారు. వెంటనే వంగాయగూడెం అరుంధతిపేట ప్రధాన రోడ్డును వేయాలని డిమాండ్ చేశారు. పడమర వీధి ఏరియాలో గాంధీ మైదానంలో ఉన్న మున్సిపల్ గాంధీ మెమోరియల్ హాలు నిరుపయోగంగా మారిందని, దాన్ని ప్రజలకు ఉపయోగపడే విధంగా చేయాలని అధికారులు కోరారు. పడమర వీధి చేపల చెట్టు సెంటర్‌లో ఉన్న మున్సిపల్ షాపులు నిరుపయోగంగా ఉన్నాయని, వాటిని ఉపయోగంలోకి తేవాలని డిమాండ్ చేశారు. ఆముదాల అప్పలస్వామి కాలనీ, గాంధీ కాలనీ, అరుంధతి పేట, నేరెళ్ల రాజా కాలనీ, మహేశ్వర కాలనీ, వంగాయగూడెం, సుబ్రహ్మణ్యం కాలనీ, చిట్టివలస పాకలు, అగ్రహారం తదితర ప్రాంతాల్లో రోడ్డు, డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. ఈ సభలో పార్టీ జిల్లా నాయకులు గుడిపాటి నరసింహారావు, పార్టీ నగర కార్యదర్శి పి.కిషోర్, సిపిఎం శాఖ కమిటీ సభ్యులు దువ్వాడ దుర్యోధన, మండూరి శ్రీనివాస్, సిహెచ్.అన్నవరం, తిరుమలమ్మ పాల్గొన్నారు.

డైస్లెక్సియాపై అవగాహనా ర్యాలీ

ఆగిరిపల్లి :విద్యార్థుల్లో చిన్న నాటి నుంచే చదవడం, రాయడంలో లోపాలను గుర్తించి వాటిని సరిచేసుకుంటూ ముందుకు సాగేలా చూడాలని ఆగిరిపల్లి ఎంఇఒ-2 కె.ఆనంద్‌కుమార్ అన్నారు. ఆగిరిపల్లిలో వికలాంగుల (భవిత)కేంద్రంలో అభ్యసనా సామర్థ్యాలు, వైకల్యాలపై(డైస్లెక్సియా)పై అవగాహనా కార్యక్రమం బుధవారం నిర్వహించారు. అనంతరం ఆగిరిపల్లి మెయిన్ పాఠశాల నుంచి పుర వీధుల్లో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐఇఆర్‌టిలు కె.జాన్సీరాణి, బి.రజని, ఫిజియోథెరపిస్టు జి.ప్రశాంతి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి యోగాసన పోటీలకు విద్యార్థులు

ప్రజాశక్తి - ఉంగుటూరు

కైకరం జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులు పాతినించి నాగరాజు, ఉప్పాడ రేవంత్‌వసంత్‌కుమార్‌లు జిల్లాస్థాయి యోగా పోటీల్లో విజయం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు గుళ్ల ప్రసాద్ తెలిపారు. ఈ నెల 15న ఏలూరు ఇండోర్ స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి యోగా పోటీల్లో ఈ విద్యార్థులు పాల్గొన్నారు. నవంబరు నెలలో నెల్లూరులో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో నాగరాజు, రేవంత్ వసంత్‌కుమార్ పాల్గొంటార న్నారు. విద్యార్థులను పీడీలు జి.నాగసుధ, ఇ.పాపాయమ్మ, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

టి.నరసాపురం :రాష్ట్ర స్థాయి యోగాసన పోటీలకు కేతవరం హైస్కూల్ ఆదో తరగతి విద్యార్థి పంతగాని ధనుష్ ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్‌ఎం ఎంవి.అప్పారావు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థికి అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా హెచ్‌ఎం మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీన ఏలూరు ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన యోగాసన పోటీల్లో అండర్-14 బాలుర విభాగంలో పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న విద్యార్థి పంతగాని ధనుష్ మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థి త్వరలో నెల్లూరులో జరగబోయే రాష్ట్ర స్థాయి యోగాసన పోటీల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జట్టు తరపున పాల్గొంటారని తెలిపారు. విద్యార్థికి తర్ఫీదు ఇచ్చిన పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు జి.రమేష్, యోగా ఇన్‌స్ట్రక్టర్ వెంకటేశ్వరరావులను ఉపాధ్యాయ సిబ్బంది, పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ గంటా బుజ్జి బాబు, పలువురు గ్రామస్తులు, తల్లిదండ్రులు అభినందించారు.

'పల్లె పండుగ'తో పూర్తిస్థాయిలో గ్రామాలాభివృద్ధి

ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

పల్లెలకు పూర్వవైభవం తెచ్చేందుకే పల్లె పండుగ పేరుతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్ కుమార్ తెలిపారు. లింగపాలెం మండలంలోని అన్ని గ్రామపంచాయతీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన బుధవారం అధికారులు, కూటమి నేతలతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారం చేపట్టిన వందరోజుల్లోనే పెద్ద ఎత్తున గ్రామాలకు ప్రభుత్వం నిధులు విడుదల చేసిందన్నారు. చింతలపూడి నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా గ్రామాల్లో తాగునీరు, విద్యుత్, రహదారులు, డ్రెయినేజీ వంటి మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నా మన్నారు. శంకుస్థాపన చేసిన పనులన్నింటినీ సంక్రాంతి నాటికి పూర్తి చేసేందుకు ప్రణాళిక రూపొందించామన్నారు. రానున్న రోజుల్లో ప్రతి గ్రామానికి మౌలిక వసతులు కల్పించి అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి, బిజెపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

నిడమర్రు : పల్లె పండుగ - పంచాయతీ వారోత్సవాలు కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రమైన నిడమర్రులో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఉంగుటూరు ఎంఎల్ఎ ధర్మరాజు బుధవారం శంకుస్థాపన చేశారు. నిడమర్రులో ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎస్ నిధులు రూ.75 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేసి శిలాఫలకాల్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో రికార్డు స్థాయిలో గ్రామసభలు నిర్వహించి సభల్లో చేసుకున్న తీర్మాణాలు కార్యరూపం దాల్చేవిధంగా పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలు కార్యక్రమం ద్వారా పెద్ద ఎత్తున అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చూడుతుండటంపై రాష్ట్ర ప్రజలు టిడిపి కూటమి ప్రభుత్వంపై హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు.



కలిదిండిలో...

కలిదిండి : గ్రామీణ అంతర్గత రోడ్ల నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని టిడిపి రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి అంద్రాజు శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని మట్టగుంటలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా రూ.15.44 లక్షల జాతీయ గ్రామీణ ఉపాధి హామీ నిధుల నుంచి మంజూరైన మూడు సీసీ రోడ్లకు ఆయన అధికారులు, నాయకులతో కలిసి బుధవారం శంకుస్థాపన చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.4,500 కోట్లతో గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు అంద్రాజు శ్రీనివాసరావు తెలిపారు. నాయకులు నాగిడి వీరబ్రహ్మం, అంద్రాజు దుర్గారావు, తిరుమాని పాండురంగారావు, ఒడుగు గణపతి, వెంకటేశ్వరరావు, తాతయ్య, సత్యనారాయణ, పంచాయతీ ఎఇ శ్రీనివాస్, ఉపాధి హామీ ఎపిఒ ఆనంద్, పంచాయతీ కార్యదర్శి శేఖర్, విఆర్ఒ డేవిడ్‌రాజు పాల్గొన్నారు.

నేడు మండలంలో పల్లె పండుగ

జీలుగుమిల్లి : నేడు మండల వ్యాప్తంగా పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలు కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ కె.వెంకటలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని 12 పంచాయతీల్లో మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం గ్రామ సభల్లో గుర్తించిన పలు అభివృద్ధి పనులకు పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు చేతులమీదుగా శంకుస్థాపనలు చేయనున్నట్లు ఆమె తెలిపారు.

ప్రకృతి సాగులో మేలైన ఆహార ఉత్పత్తులు

ప్రజాశక్తి - ఉంగుటూరు

ప్రకృతి సాగుతో ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులను పండించేందుకు రైతులు ముందుకు రావాలని మండల వ్యవసాయాధికారి ప్రవీణ్‌కుమార్ పిలుపునిచ్చారు. పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నారాయణపురం సర్పంచి దిడ్ల అలకనంద అధ్యక్షతన నిర్వహించారు. ఇ- పంట నమోదు, దానివల్ల చేకూరే ప్రయోజనాలను వివరించి లబ్ధిదారుల వివరాల జాబితాలను ప్రదర్శించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో కూటమి ప్రభుత్వం తీసుకొచ్చి అమలు చేయనున్న కొత్త విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. ధాన్యాన్ని వారికి నచ్చిన మిల్లుకే తోలుకునే నిర్ణయాధికారం రైతులకు ఉందన్నారు. రైతు సేవా కేంద్రంలో తూచిన తేమ శాతాన్నే ప్రామాణికంగా తీసుకోనున్నామని చెప్పారు. సర్పంచి అలకనంద మాట్లాడుతూ ప్రభుత్వం రైతు సంక్షేమ పథకాలను అందిపుచ్చుకుంటూ లాభదాయకంగా సాగు చేసుకోవాలని కోరారు.

టి.నరసాపురం :రైతులు తమ సాగు వివరాలు ఇ-పంటలో నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ శాఖాధికారి బి.సుమలత సూచించారు. మండలంలోని వెలగపాడు, అల్లంచెర్ల, రాజుపాలెం పంచాయతీలో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు వ్యవసాయ శాఖ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పథకలు వివరించారు. సాగులో రైతులకు పలు సూచనలు అందించారు. ఈ సందర్భంగా సుమలత మాట్లాడుతూ రైతులు ఇ-పంటలో పంట వివరాలు నమోదు చేయడం ద్వారా రైతులు తమ పంటను రైతు సేవ కేంద్రంలో, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించొచ్చన్నారు. ప్రకృతి వైపరీత్యాలు జరిగితే పంట నష్టపరిహారం పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు శీలం వెంకటేశ్వరావు, సర్పంచి నర్ని వెంకట్రావు, రైతులు వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ముదినేపల్లి : మండలంలోని గురజ, పెనుమల్లి గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాలు మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతు శిక్షణ కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు లలిత సుధా పాల్గొని మాట్లాడుతూ రైతులు విధిగా మట్టి నమూనాలను పరీక్షించుకుని సిఫార్సు చేయబడిన ఎరువులను మాత్రమే వాడాలని సూచించారు. మండవల్లి సహాయ వ్యవసాయ సంచాలకులు జి.వెంకటమణి మాట్లాడుతూ తొలకరిలో భూసారాన్ని పెంచుకునేందుకు పచ్చిరొట్టపైన విధిగా సాగు చేసుకోవాలన్నారు. మండల వ్యవసాయాధికారి బి.వేణుమాధవ్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఈ సీజన్‌లో ధాన్యం కొనుగోలు చేయుటకు అన్ని రకాల ఏర్పాట్లు చేశామని తెలిపారు.

పోలవరం : మండలంలోని జిల్లెల్లగూడెంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి సమస్యలకు అక్కడే పరిష్కార మార్గాలు సూచించారు. అనంతరం రైతు సేవా కేంద్రంలో రైతులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కె.రాంబాబు, రైతులు, వ్యవసాయ శాఖ అనుబంధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల ప్రక్రియపై అవగాహన అవసరం

చింతలపూడి :భారతదేశంలో ఓటరు అక్షరాస్యతను ప్రోత్సహించడం కోసం భారత ఎన్నికల సంఘం ప్రధాన కార్యక్రమం స్వీప్ అని చింతలపూడి డిప్యూటీ తహశీల్దార్ షకీలా అన్నారు. పట్టణంలో ఎంఎల్‌సి గ్రాడ్యుయేట్ ఓటర్ల అవగాహన కార్యక్రమాన్ని చింతలపూడి ఇంటర్ గవర్నమెంట్ కాలేజీలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహశీల్దార్ షకీలా మాట్లాడుతూ పౌరులకు, ఓటర్లకు ఎన్నికల ప్రక్రియ గురించి అవగాహన కల్పించేందుకు స్వీప్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంఇఒ-1 రామారావు, ఎంఇఒ-2 కిరణ్‌బాబు, గవర్నమెంట్ కాలేజీ ప్రిన్సిపల్ స్వైలాబ్ పాల్గొన్నారు.

దస్తావేజులు పోయినవి

ఏలూరు జిల్లా, దెందులూరు మండలం, కొవ్వలి గ్రామ కాపురస్తులు నా క్లయింటు అయిన చంపాటి నరశింహరాజు గారి కుమారుడు చంపాటి రామరాజు గార్కి గల **8328/2014 మరియు 1230/2009** అను ఈ రెండు దస్తావేజులు ది.12-11-2024వ తేదీన కొవ్వలి నుండి ఏలూరు వెళుతుండగా దస్తావేజులు కలిగిన కవర్ సత్రంపాడు మార్గంమధ్యలో పడిపోయినది. కావున దొరికిన వారు క్రింది అడ్రసుకు తెలియజేయగలరు.

ఎ.మణికుమార్
అడ్వకేట్, వట్లూరు, ఏలూరు
సెల్: 94416 40035

దస్తావేజులు పోయినవి

మా క్లయింటు పులవర్తి దేవానంద్, తండ్రి: భుజంగరావు, దుగ్గిరాల, పెదవేగి మండలం, ఏలూరు జిల్లా కాపురస్తులు సంజాయిషీపై తెలియజేయునది ఏమనగా.., ఏలూరు ఎస్.ఆర్.ఓ.కు చెందిన ఒరిజినల్ దస్తావేజు నెం.2255/2001, తేదీ.23-03-2001 గల దఖలు దస్తావేజులో ఆర్.ఎస్.నెం. 428, దుగ్గిరాలలో జేరియున్న 108.8/9 చ॥గ॥ల యొక్క స్థలము అందలి ఆర్.సి.సి. డాబా ఇంటి యొక్క దస్తావేజులు బ్యాంకు లోను నిమిత్తంగా జిరాక్సు తీసుకొనుటకు ఇంటి నుండి వెళ్ళు చుండగా ది.13-10-2024న మార్గమధ్యమున కొత్త బస్టాండు సమీపంలో పోగొట్టుకొని యున్నారు. సదరు దస్తావేజు ఎవరికైననూ దొరికిన ఎడల ఈ క్రింది అడ్రసుకు తెలియజేయగలరు.

మారిశెట్టి సుశీల
అడ్వకేట్, తూర్పు వీధి, ఏలూరు.
సెల్: 85209 78581

ప్రకటన

మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

యస్.ఓ.పి.నెం. 2/2024

Between:
Pothuri Srinivasa Raju, S/o. Venkata Rama Raju, Resident of 1-1-365/B/1/309, Siddamsetti Towers, Near R.T.C. X Roads, Jawahar nagar, Hyderabad-500020. Hyderabad City Civil Courts. ...Petitioner

AND

Pothuri Butchi Raju, S/o. Venkata Rama Raju, R/o. Plot No.92, Kalyan Nagar, Phase-3, Opp. Bhargavi Hospital, Motinagar, Hyderabad-500020. ...Respondent

పై నెంబరు పిటీషనరు, స్వర్గీయ పొత్తూరి వెంకట రామరాజు మరియు స్వర్గీయ పొత్తూరి అన్నపూర్ణమ్మ గారల వారసులలో తనను ఒక వారసుడిగా ప్రకటించి వారి పేరున ది.కరూర్ వైశ్య బ్యాంకు లిమిటెడ్, పాలకొల్లు, ది.కనక మహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్ పాలకొల్లు మరియు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఏనుగువానిలంక, నరసాపురం మండలంలలో గల పైన తెలిపిన వారి సొమ్ములలో (పై పిటీషను షెడ్యూలలో చూపించిన) తనకు సగము వాటా కలదని సక్సెషన్ సర్టిఫికెట్ జారీ చేయవలసినదిగా కోరుచూ పై నెంబరు పిటీషను దాఖలు చేసినందున ఎవరికైనా, ఏవిధమైన అభ్యంతరములు ఉన్న ఎడల **ది.04-11-2024వ తేదీ ఉదయం గం॥10:00 ని॥ల పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, అడ్వకేట్ ద్వారా గాని హాజరై తమ అభ్యంతరములు తెలియచేసుకొనవలెను.**

MAJJI VVS VARA PRASAD
Narsapuram, Advocate, Palakol
16-10-24. Cell: 9393222736

మహారాజశ్రీ పాలకొల్లు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టు

ఓ.ఎస్.నెం. 116/2020

బిట్వీన్:
1) శ్రీమతి దున్న విజయ లక్ష్మి @ జయమ్మ
2) దున్న నరసిహ స్వామి
3) సరిల్లా ధనలక్ష్మి ...వాదులు

AND

1) వెన్నపు పెద్ద అబ్బాయి @ పెద్ద అబ్బులు
2) శ్రీమతి వెన్నపు కుమారి
3) వెన్నపు నాగరాజు
4) వెన్నపు రమేష్
5) వెన్నపు గంగాధర్ ...ప్రతివాదులు

4వ మరియు 5వ ప్రతివాదులు:
4వ ప్రతివాది: వెన్నపు రమేష్, తండ్రి: లేటు సుబ్బారావు, వెన్నపు వారి పాలెం (ఆచంట శివారు), ఆచంట మండలం.
5వ ప్రతివాది: వెన్నపు గంగాధర్, తండ్రి: లేటు సుబ్బారావు, వెన్నపు వారి పాలెం (ఆచంట శివారు), ఆచంట మండలం.

దావా సమను

వాదులు దావా షెడ్యూలు ఆస్తి అయిన ఆచంట గ్రామంలో రి.స.నెం.932/4రలో య.0-40 సెంట్లులో ఉత్తరం వైపు య.0-20 సెంట్లు భూమి ఆస్తి శ్రీమతి వెన్నపు చంద్రమ్మ గారు ది.24-05-2010 సం॥రం తేదీన వాదులకు సెటిల్మెంట్ దస్తావేజు నెం.875/2010 రుగా దఖలు పర్చిన రీత్యా వాదులకు సంక్రమించిన ఆస్తి వారికి Vacant Possession గా అప్పగించవలెనని మరియు Past Profits వగైరాల పరిహారములతో పై దావా వేసియున్నారు. మరియు సదరు దావాలో I.A.No.617/2020 (Or 40 Rl 1) పిటీషను కూడా వేసియున్నారు. సదరు దావా ది.24-10-2024 సం॥రం తేదీకి పై కోర్టు వారు వాయిదా వేసియున్నారు. సదరు దావాలో 4వ మరియు 5వ ప్రతివాదులు, పిటీషనులో 4వ, 5వ రెస్పాండెంట్లు అయ్యిన మీరు **ది.24-10-2024 సం॥రం తేదీన మీరు స్వయంగా గాని వకీలు ద్వారా గాని హాజరు అయ్యి మీ వాదన తెలియపర్చనిచో సదరు దావా మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియచేయడమైనది.**

కంచెర్ల సురేష్ బాబు
పాలకొల్లు, వాదుల తరపు అడ్వకేట్
16-10-24. సెల్: 9440111308